

కేంద్ర పురావస్తుశాఖ నిర్లక్ష్యం..
కేంద్ర పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యంతో చారిత్రక ఖిలావరంగల్ మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగరలేదు. - 8లో



ప్రజా ఆశీర్వాదంతో మళ్లీ విజయం
ప్రజలు, దేవుడి ఆశీర్వాదంతో తెలంగాణలో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. - 9లో

గరిష్టం/కనిష్టం
31°/24°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణ పరిస్థితిలో ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉండి, రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రెహమాన్‌కు రాష్ట్రస్థాయి పతకం



దేవరుప్పుల : వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో వరదనీటిలో తెప్పతో వెళ్లి పునరుద్ధరించిన రెహమాన్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు లభించింది. ఈ మేరకు ధర్మాపురం విద్యుత్‌శాఖ జేఎల్‌ఎం రెహమాన్ మంగళవారం హైదరాబాద్‌లో సీఎం కెసీఆర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పతకాన్ని అందుకున్నారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ వేణుమాధవ్, డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఏడీఈ అనిల్, ఏఈ సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ రూరల్: ఈనెల 17న(రేపు) జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పెద్ది వెంకటనారాయణ, గంగిశెట్టి మనోజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14, 16, 18, 20, 20 ఏళ్లపై బడిన బాలబాలికలు పోటీల్లో పాల్గొనాలని 600, 800, 1500, 3000, 5000, 1000 మీటర్ల పరుగు పందెం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిభ చూపినవారు ఈనెల 20వ తేదీన గోల్కొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని వెల్లడించారు. ఆసక్తిగల వారు సంబంధిత ధ్రువపత్రాలతో పట్టణంలోని ధర్మకంచ స్టేడియానికి రావాలని, మరిన్ని వివరాలకు 98850 46437 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

చిల్పూరు: ఈనెల 17న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ను నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ మాలోతు హుస్సేన్ నాయక్ తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. గురువారం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ ఆవరణలో ఉదయం 10.30 నుంచి ఒంటిగంట వరకు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఓవర్‌లోడ్, కేటగిరి మార్పిడీ, అడిషనల్ లోడ్, ఇతర వినియోగదారుల సమస్యలపై రైతుల నుంచి స్వయంగా తెలుసుకుని పరిష్కరిస్తామ ని పేర్కొన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ రమేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ వడ్డెపల్లి యాదగిరి, జేఎల్‌ఎం అశోక్, కట్టర్ సురేష్ పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ స్టేట్‌మీట్‌కు ఝూన్సీబాయి



దేవరుప్పుల : ఇంటింటా ఇన్నోవేటర్ స్టేట్‌మీట్‌కు బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని ఝూన్సీబాయి ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో స్వీట్ టూ బ్రెయిలీ టీజింట్ డివైజ్ విభాగంలో మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, కలెక్టర్ శివలింగయ్య చేతులమీదుగా ఝూన్సీబాయి ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. దీంతో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు, ఉపాధ్యాయులు మదన్‌మోహన్, ఖాజా, మాధవి హర్షం వ్యక్తం చేశారు.

మినీ లెదర్‌పార్కు సందర్శన

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ శివారులోని మినీ లెదర్‌పార్కును బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాజారపు ప్రతాప్.. షెడ్యూల్ కులాల హక్కుల అభివృద్ధి సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు, దళితరత్న యమడాల హనుకాంత్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గతంలో లిడ్‌క్యాప్‌లో పనిచేసేందుకు శిక్షణ పొందిన వారు అక్కడకు చేరుకుని తమ సమస్యల్ని ప్రతాప్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రతాప్ మాట్లాడుతూ నిరుపేద మాదిగలకు ఉపాధి కల్పన కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో లిడ్‌క్యాప్ ఏర్పాటు కోసం 25 ఎకరాల స్థలాన్ని కేటాయించారన్నారు. లెదర్ వస్తువులైన చెప్పులు, బ్యాగులు తదితర వస్తువుల తయారీపై కొందరికి మద్రాస్‌లో మాస్టర్ ట్రైనింగ్ ఇచ్చారని, పాలకుల నిర్లక్ష్యంతో తోళ్లపరిశ్రమ ఊసే లేకుండా పోయిందన్నారు. లిడ్‌క్యాప్‌కు కేటాయించిన స్థలంలో శిక్షణ పొందిన వారి ఉపాధి కల్పన కోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కుమారస్వామి, దశరథ్, ఈశ్వరయ్య, శ్రీనివాస్, చంద్రమౌళి, మల్లేష్, నాగరాజు, శ్రీధర్, ప్రేమానందం, వెంకటయ్య, అశోక్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కరువునేలలో జలసవ్వడి

- 4.50లక్షల ఎకరాలకు సాగునీరు
- మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు, శిక్షణ
- పంద్రాగస్టు వేడుకల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- రూ.411కోట్ల రుణమాఫీ
- గృహలక్ష్మిలో 4,940 మందికి లబ్ధి



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, డీసీపీ



ప్రసంగిస్తున్న మంత్రి దయాకర్‌రావు

జనగామ:

కరువు కాటకాలతో వ్యవసాయమంటేనే దండుగ అని భావించిన రైతుల కుటుంబాల్లో కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల జలకళతో జనగామలో గోదావరి జలాల సవ్వడి అన్నదాతల కుటుంబాల్లో వెలుగు నింపుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు మంత్రి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, కలెక్టర్‌తో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డితో కలిసి దయాకర్‌రావు ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంలో జనగామ జిల్లాలో రెండు పంటలకు కలిపి 77వేల ఎకరాలకుసాగు నీరు అందిస్తే, ప్రత్యేక తెలంగాణలో 4,51,778 ఎకరాలకు అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. స్వరాష్ట్రంలో సాగు విస్తీర్ణం 5,68,800ఎకరాలకు పెరగగా, ఉమ్మడి రాష్ట్రంతో పోల్చి చూస్తే 412 శాతం అదనమన్నారు. పదేళ్ల కాలంలో అన్ని రంగాల్లో దేశంలోనే మన రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. జాతీయ స్థాయిలో రాష్ట్రానికి వచ్చిన అవార్డులు కేసీఆర్ సమర్థవంతమైన పాలనకు గీటురాయి అన్నారు.

సంక్షేమం ఇలా..

జిల్లాలో పెట్టుబడి సాయం కింద 2018 వానాకాలం నుంచి ఇప్పటి వరకు 1,68,678 మంది రైతులకు 11 విడతల్లో రూ.1,917కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రెండు విడతల్లో 74వేల పైచిలుకు రైతులకు రూ.411కోట్ల 54 లక్షల పంట రుణాలను మాఫీ చేశామన్నారు. వైద్య రంగంలో 66 ఏళ్లల్లో సాధ్యం కాని ఎన్నో రికార్డులను ప్రభుత్వం పదేళ్ల కాలంలో సాధించిందని తెలిపారు. జనగామ మెడికల్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి 100 ఎంబీబీఎస్ సీట్లను కేటాయించడంతోపాటు 115 మంది స్పెషల్ డాక్టర్ల రిక్రూట్‌మెంట్ చేపట్టినట్లు పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో జిల్లాలోని 281 గ్రామ పంచాయతీల్లో రూ.28 కోట్ల 74 లక్షల నిధులు విడుదల కాగా, రూ.19.43 కోట్ల ఖర్చు అయినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మహిళా సంఘాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తల కోసం జిల్లాలో 39 ఆహార తయారీ యూనిట్లను ఏర్పాటు చేసి, రూ.83లక్షలు కేటాయించామన్నారు. మహిళా సంఘాల సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు అంతర్జాతీయ మార్కెటింగ్ సంస్థ ఫ్లిప్ కార్ట్‌తో రూ.3.66కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా రూ.5 కోట్లతో 3వేల మంది మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు ఉచిత టైలరింగ్ శిక్షణ అందించి, కుట్టు మిషన్లను పంపిణీ చేసినట్లు స్పష్టం చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, ఐకేపీ, మెప్మా ద్వారా 2014-2015 నుంచి ఇప్పటి వరకు బ్యాంకు లింకేజ్ ద్వారా వెయ్యి 129 సంఘాలకు రూ.53.83కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో రోడ్లు, వంతెనల నిర్మాణం కోసం రూ.150.50 కోట్ల అంచనా వ్యయంతో 37 పనులకు పరిపాలనా అనుమతి పొందినట్లు చెప్పారు. గృహలక్ష్మి పథకంలో 4,940 ఇళ్లు మంజూరయ్యాయని, త్వరలో పంపిణీ ఉంటుందన్నారు. మైనార్టీ బంధులో జిల్లాలోని 360 మందికి రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీకి సిద్ధమవుతున్నట్లు చెప్పారు.

స్టాల్స్ సందర్శన

పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని పోలీస్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ, ఉద్యాన పట్టు పరిశ్రమ, నీటిపారుదల, వైద్య ఆరోగ్య, పౌరసరఫరాల, వ్యవసాయ, టెస్కో చేనేత వస్త్ర ప్రదర్శనశాల, మిషన్ భగీరథ, జిల్లా విద్యాశాఖ, ఎస్సీ కార్పొరేషన్, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ, జిల్లా మత్స్యశాఖ, ఎక్సైజ్, జిల్లా పర్యటక శాఖ, అటవీ, మెప్మా, విజయ డైరీ, పశుసంవర్ధక శాఖతోపాటు తదితర శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయగా, మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు వాటిని సందర్శించారు. కాగా, జిల్లాకు పది 108 అంబులెన్స్, 102 వాహనాలను ప్రభుత్వం రీప్లేస్‌మెంట్ చేయగా మంత్రి దయాకర్ రావు జెండా ఊపి ప్రారంభించారు.



వేడుకలను తిలకించేందుకు వచ్చిన ప్రజలు, అధికారులు, చిన్నారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మినీ స్టేడియంలో రైల్వేస్టేషన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏకశిల పబ్లిక్ స్కూల్, కోర్టు ఏరియాలోని బాలిక ఉన్నత పాఠశాల, డీడబ్ల్యూఓ నుంచి కిడ్స్, బాలికలు, ఎస్వీఆర్ స్కూల్, హైదరాబాద్ రోడ్డు సెయింట్ మేరీస్ స్కూల్, ధర్మకంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహిళ, శిశు, దివ్యాంగులు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నలుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, కర్రలను మంత్రి అందించారు. కార్యక్రమంలో డీసీపీ సీతారం, రెవెన్యూ, లోకల్ బాడీ విభాగం అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, సుహాసిని, మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవల్లి కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయ ఇన్‌చార్జ్ డాక్టర్ సుల్తాన్‌రాజా, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే జాతీయ జెండాను ఎగురవేసి, మాట్లాడారు. సీఎం కేసీఆర్, అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కౌన్సిలర్ లక్ష్మిశ్రీశైలం, అనిత, కర్రె శ్రీనివాస్, బండ పద్మ, పేర్ని స్వరూప, పగిడిపాటి సుధసుగుణాకర్‌రాజు, ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, నాయకులు పసుల ఏబేలు, మల్లిగారి రాజు, బిజ్జాల నవీన్‌గుప్తా, ఉల్లెంగుల సందీప్, మిద్దెపాక లెనిన్, దేవునూరి సతీష్, ఉడుగుల నర్సింహులు, ఉమేష్, మధుసూదన్ తదితరులు ఉన్నారు.



జెండాను ఎగుర వేసి నినదిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

అభివృద్ధిలో స్టేషన్‌ఘన్‌పూర్ నంబర్ వన్

- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య
- జఫర్‌గఢ్ కోటపై పంద్రాగస్టు వేడుకలు

జఫర్‌గఢ్: సంక్షేమం, అభివృద్ధిలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నంబర్ వన్ స్థానంలో ఉందని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పేర్కొన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో చారిత్రాత్మక ప్రాంతమైన జఫర్‌గఢ్ హన్మకొండ కోటపై మంగళవారం వేడుకలు నిర్వహించగా.. ఎమ్మెల్యే రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరై తివర్ణ పతకాన్ని ఎగురవేసి, మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడాలేని విధంగా రిజర్వాయర్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. సాగునీటితోపాటు అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యే రాజయ్య కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ ఇల్లందుల బేబి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య, స్రవంతి మొగిళి, శివయ్య, సర్పంచ్‌లు తాటికాయల అశోక్, బల్లెపు నర్సింగరావు, గాదె ప్రవీణ్‌రెడ్డి, తహసీల్దార్ అంజయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల : మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండలంలోని చిన్నమడూరులో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందినవారికి మంగళవారం మంత్రి సర్టిఫికెట్లతోపాటు కానుకగా చీరను అందజేశారు. పలు సామాజిక వర్గాల ఆర్థికాభివృద్ధి కోసం ఎలాంటి షరతులు లేకుండా విరివిగా రుణాలు ఇస్తున్న ఘనత కేసీఆర్ సర్కార్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వ తోడ్పాటుకు ట్రస్టు ఆధ్వర్యంలో చేదోడుగా ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పిస్తున్నట్టు పేర్కొన్నారు. పాలకుర్తిలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళ కోసం ఈనెల 24 వ తేదీన వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాలకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నల్లకుంట, రంబోజీగూడెం, రాజీవ్‌నగర్, కామారెడ్డిగూడెం, కడవెండిలో వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి, సర్పంచ్ వంగ పద్మ, ఎంపీటీసీ గొడుగు సుజాత, డీఆర్‌డీఏ ఏపీడీ నూరోద్దీన్, కుట్టు శిక్షణ పర్యవేక్షణ అధికారి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, సుందర్‌రామిరెడ్డి, శ్యామల విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

కలెక్టరేట్, కోర్టు, జెడ్పీలో ఎగిరిన జాతీయ జెండా

జనగామ: పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని జనగామ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ శివలింగయ్య జెండాను ఎగురవేశారు. అంతకు ముందు కలెక్టర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు.

కోర్టులో..

జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయమూర్తి డీ.రవీంద్ర శర్మ జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన న్యాయవాదులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ జడ్జి విక్రమ్, ప్రిన్సిపల్ జడ్జి సుచరిత, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కూరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్, ఏజీపీ రామ్ గోపాల్, న్యాయవాదులు శ్రీరాం శ్రీనివాస్,ప్రసాద్ రావు తదితరులు ఉన్నారు.

జెడ్పీ కార్యాలయంలో..

జనగామ రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ, ఎంపీపీ మేకల కళింగ రాజు, ఎంపీడీఓ హసీం, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జడ్జి రవీంద్రశర్మ



కలెక్టరేట్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ శివలింగయ్య, అధికారులు



జెండా ఆవిష్కరిస్తున్న సంపత్‌రెడ్డి

'పల్లా' అనుచరులను అడ్డుకున్న సర్పంచ్‌లు

నర్మెట: ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనుచరులను మండల సర్పంచ్‌లు అడ్డుకున్న ఘటన మండలంలోని మచ్చుపహాడ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పంద్రాగస్టు వేడుకల అనంతరం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామిని శివరాజ్ ఇంట్లో పలువురు సర్పంచ్‌లు, సర్పంచ్‌ల భర్తలు సమావేశమయ్యారు. ఈలోగా గతంలో మండల విలేకరిగా పనిచేసిన వ్యక్తి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనుచరుడితో కలసి అక్కడికి చేరుకుని మీరంతా పల్లా రాజేశ్వర్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో మద్దతు తెలుపుతున్నట్లు తీర్మానం చేసి ఇవ్వాలని కోరడంతో వాగ్వాదం మొదలైంది. పల్లా ఎమ్మెల్సీ కావచ్చు మాకు ఆయన చేసిన అభివృద్ధి ఏమీలేదు కనీసం పరిచయం కూడాలేదు.. గ్రామాల్లో ఈవిధమైన ప్రచారాలు మొదలు పెడితే మేము చూస్తూ ఊరుకోం.. ప్రస్తుతం మేమంతా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి వర్గీయులమే.. అధిష్టానం ఎవరికి టిక్కెట్ ఇస్తే వారివెంటే అంటూ వారిపై ఆగ్రహించారు. దీంతో వారు వెళ్లిపోయారు. ఇప్పటికే ఓవైపు పోచంపల్లి అభిమానులు మండలంలో పలు కార్యక్రమాలు చేపడుతుంటే మరోవైపు పల్లా వర్గీయుల మండల సర్వే, నాయకులను మచ్చిక చేసుకోవాలను కోవడంతో కార్యకర్తల్లో అయోమయం, మండలంలో చర్చ మొదలైంది.



మచ్చుపహాడ్‌లో సమావేశమైన సర్పంచ్‌లు

పతాకావిష్కరణ మరిచారు..!

- బ్యాంక్ ఎదుట ఎగరని జాతీయ జెండా
- అసహనం వ్యక్తం చేసిన స్థానికులు



బచ్చన్నపేటలోని సీబీఐ శాఖ కార్యాలయం

బచ్చన్నపేట: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. కానీ, బచ్చన్నపేట మండల కేంద్రంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం మరిచారు. బ్యాంక్ అధికారులు, సిబ్బంది మంగళవారం బ్యాంకు వైపు రాకపోవడం గమనార్హం. దీంతో స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

నిబంధనలకు లోబడే పోలీస్ పోస్టింగ్‌లు

- సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు లోబడే వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పోస్టింగ్‌లు జరిగాయని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని 21 మంది పోలీస్ అధికారులకు నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందినట్లు ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్నికల కమిషన్ జూన్ 2 నాటికి అధికారుల బదిలీలకు గడువు ఇచ్చిందని, దానికి కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగానే బదిలీలు జరిగాయని వివరించారు. ఫిర్యాదులు వచ్చిన 21 మంది అధికారుల పోస్టింగ్‌లు సైతం నిబంధనలకు లోబడే చేసినట్లు తెలిపారు.

నేడు కేయూ బంద్

కేయూ క్యాంపస్ : తెలంగాణ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న తెలంగాణ స్టేట్ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం పిలుపుమేరకు బుధవారం కాకతీయ యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆ అసోసియేషన్ జాక్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 100 రోజులుగా వివిధ నిరసన కార్యక్రమాలు, ధర్నాలు, దీక్షలు చేపట్టామని ప్రజాప్రతినిధులకు కూడా వినతిపత్రాలు సమర్పించామని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీలోనూ పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావించినా ప్రభుత్వంనుంచి స్పందన లేదని తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్లకు అకుట్, పార్ట్‌టైం అధ్యాపక, వివిధ విద్యార్థి సంఘాలు మద్దతునివ్వాలని కోరారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన



మౌత్‌వాష్, పేస్టులు అందజేస్తున్న డాక్టర్ గిరిధర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హనుమకొండ విజయటాకీస్ రోడ్డులోని ఎస్‌వీఎస్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గిరిధర్‌రెడ్డి పాల్గొని పలువురికి పరీక్షలు చేశారు. ఉచితంగా పేస్టులు, మౌత్‌వాష్‌లు, మందులు పంపిణీ చేశారు. దంత సంరక్షణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అలరించిన ఆర్య నాటిక



నాటికలోని ఓ సన్నివేశం

హన్మకొండ కల్చరల్ : 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా వరంగల్ ఓరుగల్లు శారదా నాట్యమండలి ఆధ్వర్యంలో సోల్జర్ షఫీ మహమ్మద్ రచించి దర్శకత్వం చేసిన ఫ్రీడమ్ ఫైటర్ నీరా ఆర్య నాటిక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. మంగళవారం రాత్రి పోతన విజ్ఞాన పీఠంలో నాట్యమండలి అధ్యక్షుడు జీఎస్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన నాటక ప్రదర్శనలో సురభి హారిక, రేలారే శాలిని, జూలూరి నాగరాజు, సుధాకర్, అశోక్‌కుమార్, మధు, విజయారాజ్, సురేష్, లింగమూర్తి, రవికుమార్, శివ, సంగీతం సురభి నాగరాజు, లైటింగ్, సెట్టింగ్ సురభి సంతోష్ అందించారు. అనంతరం విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ రాజశేఖర్, ఎక్స్‌సోల్జర్ మనోజ్ ప్రభాకర్, బిట్ల వేణుగోపాల్, సుబేదార్ మల్లేశాన్ని సన్మానించారు.

ముగిసిన కార్తీక్ అంత్యక్రియలు



కార్తీక్ (ఫైల్)

టేకుమట్ల : మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ కొలుగూరి కార్తీక్ (31) శనివారం రాత్రి ఉత్తరాఖండ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. కాగా, ఆర్మీ అధికారులు ఉత్తరాఖండ్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కార్తీక్ పార్థివదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో మండల కేంద్రానికి తరలించారు. మంగళవారం సాయంత్రం కొనసాగిన కార్తీక్ అంతమయాత్ర రాత్రి 9.30లకు ముగిసింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కడసారి వీడ్కోలు పలికి కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, కార్తీక్ పార్థివదేహం మండల కేంద్రానికి చేరుకోగానే భార్య ప్రవళిక బంధువులతో కార్తీక్ కుటుంబ సభ్యులకు గొడవ మొదలైంది. ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చేటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

ఉత్తములకు అవార్డులు



ప్రశంస పత్రం అందుకుంటున్న జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్

జిల్లాలో వివిధ శాఖలు, కార్యాలయాల్లో, స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తూ సమాజహితానికి సహకరిస్తున్న పలువురు మంగళవారం ఉత్తములుగా అవార్డులు అందుకున్నారు. ఈక్రమంలో జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. కలెక్టర్ శివలింగయ్యతో కలిసి అవార్డులు అందజేశారు. - జనగామ



చంద్రశేఖర్, పీఆర్‌ఈఈ | రమేష్, ఇండస్ట్రియల్ మేనేజర్ | రోజారాణి, సివిల్ సప్లయీస్ | కేఆర్ లత, హార్టికల్చర్ అధికారి



వేణుమాధవ్, ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ | రాజేంద్రప్రసాద్, డీపీఆర్‌ఓ | దామోదర్, గృహ నిర్మాణ శాఖ ఈఈ | రాము, డీఈఓ | రవీందర్, కలెక్టరేట్ ఏఓ | శ్రీకాంత్, కలెక్టరేట్ విభాగం | అర్జున్, కలెక్టరేట్ విభాగం | అభిషేక్, కలెక్టరేట్ విభాగం | సత్యనారాయణ, ఓఎస్, కలెక్టరేట్ | సిద్ధులు, కలెక్టరేట్ డ్రైవర్ | కె.రాజు, సీసీ, ఏసీ,రెవెన్యూ | ఏ.సత్యపాల్, సీసీ, ఏసీ, లోకల్‌బాడీ



దుర్గారావు, ఈడీఎం | గౌసియా, జిల్లా సైన్స్ అధికారి | దేవేందర్‌రెడ్డి, జనగామ ఏసీపీ | విశ్వేశ్వర్, సీఐ | శ్రీనివాస్, జనగామ సీఐ | రాజశేఖర్, సీఐ | తరిగొప్పల నరేష్ | అనిల్ కుమార్, కానిస్టేబుల్ | వేణుగోపాల్, ఇంటెలిజెన్స్ విభాగం | నూరొద్దీన్, అడిషనల్ డీఆర్డీఓ | మహిపాల్, మున్సిపల్ ఏఈ | శ్రీనివాస్, పీఆర్ డీఈ



డాక్టర్ కమల్‌హాసన్ | ప్రభాకర్, డీఎంహెచ్‌ఓ | మధు, ఎస్సై | శ్రీనివాస్, సివిల్ సప్లయీస్ డీటీ | ధనరాజ్, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ | శ్రీనివాస్, డీపీఆర్‌ఓ కార్యాలయ ఎస్‌ఏ | బాబూరావు, ఏఎంసీ కార్యాలయం | సుగుణాకర్‌రాజు, సూపరింటెండెంట్





ధర్మకంచ మినీ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు



అంబులెన్స్ వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ధర్మకంచ మినీ స్టేడియంలో వేడుకలను తిలకించేందుకు వచ్చిన ప్రజలు, అధికారులు

పాముకాటుతో యువకుడి మృతి

● ఇబ్రహీంపూర్‌లో ఘటన



మహేష్ (ఫైల్)

రఘునాథపల్లి: పాము కాటుతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన దొరగొల్ల ఎల్లయ్య, లక్ష్మి దంపతులకు ఒక కుమారుడు మహేష్ (27), ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయంతో పాటు గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రులకు చేదోడువాడుగా ఉండే మహేష్ మంగళవారం గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. గ్రామ పెద్ద చెరువు కట్ట చివరన గొర్రెలను మేపుతుండగా మహేష్‌కు పాము కాటువేసింది. తనకు పాము కాటువేసినట్లు స్నేహితులకు ఫోన్ చేసి తెలిపాడు. ఘటనా స్థలిలోనే అస్వస్థతకు గురైన మహేష్‌ను స్థానికులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. కాగా, అందరితో కలివిడిగా ఉండే మహేష్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



మధుకర్ మృతదేహం

ఎల్కతుర్తి : అప్పులు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని గోపాల్‌పూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన పెండ్యాల మధుకర్ (35) వ్యవసాయం, కుటుంబ అవసరాల నేపథ్యంలో విరివిగా అప్పులు చేశాడు. ఎలా తీర్చాలని కొంత కాలంగా మదనపడుతున్నాడు. ఈ విషయమై సోమవారం సాయంత్రం దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన మధుకర్ వ్యవసాయ పొలం వద్ద మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు.

చిన్నారిని ఢీకొన్న కారు

● పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన నందిని

గూడూరు: జాతీయ రహదారి దాటుతున్న ఓ చిన్నారిని కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆ బాలిక పరిస్థితి విషమంగా మారింది. మండలంలోని మర్రిమిట్టకు చెందిన చింత నర్సయ్య, హేమలత దంపతుల కూతురు నందిని ఆ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటోంది. మధ్యాహ్నం సమయంలో ఎన్‌హెచ్‌కు పక్కన ఉన్న పాఠశాల నుంచి రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో నర్సంపేట వైపు నుంచి వస్తున్న భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన కారు బాలికను ఢీకొంది. దీంతో గ్రామస్తులు వెంటనే బాలికను వరంగల్‌లోని ఓ ఆసత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. కారుతో పాటు అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

‘తూర్పు’ నుంచి గణేశ్‌కు అవకాశం కల్పించాలి

● మంత్రి కేటీఆర్‌ను కలిసిన బ్రాహ్మణ సంఘాల నాయకులు



మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

రామన్నపేట/హన్మకొండ: వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వద్దిరాజు గణేష్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమ శాఖ మంత్రి కేటీఆర్‌కు బ్రాహ్మణ సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్లలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్‌ను బ్రాహ్మణ సంఘాల నాయకులు కలిశారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి రాజకీయపరంగా సముచిత స్థానం కల్పించాలని, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ, వరంగల్ జిల్లాలో బ్రాహ్మణ జాతిని ఏకతాటి పై తీసుకువచ్చిన వద్దిరాజు గణేష్‌కు వరంగల్ తూర్పు టికెట్ కేటాయించాలని కోరారు. సీఎం కేసీఆర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగు ఉపేంద్రశర్మ, జగన్‌మోహన్ శర్మ, లక్ష్మణ్ శర్మ, వెంకటేశ్వరరావు, సత్యమోహన్, శ్రీనివాసాచారి, పి.శ్రీనివాసరావు, శ్రీకాంత్, శరత్, శిరీష్, నాగేందర్, జయప్రసాద్ రావు, శ్రీనివాస్‌రావులు పాల్గొన్నారు.

కేంద్ర పురావస్తుశాఖ నిర్లక్ష్యం..

● శిల్పాల ప్రాంగణంలో ఎగరని జాతీయ జెండా
● పర్యాటకుల అసహనం



మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో బోసిపోయి కనిపిస్తున్న స్తంభం

ఖిలా వరంగల్ : కేంద్ర పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఖిలావరంగల్ మధ్యకోట శిల్పాల ప్రాంగణంలోని స్తంభం వెలవెలబోయింది. ఇక్కడ ఏర్పాటు చేసిన స్తంభంపై స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగరలేదు. కేవలం రాతి కోట ఉత్తర ద్వారా సమీపంలోని కోట బురుజుపై పురావస్తుశాఖ అధికారి తాత్కాలిక జెండా చేతపట్టి ఫొటోలు దిగారని పలువురు జాతీయవాదులు ఆరోపిస్తున్నారు. కాగా, మంగళవారం వరంగల్ ఉమ్మడి జిల్లాతోపాటు దేశ, విదేశీయులు పర్యాటకులు భారీ సంఖ్యలో చేరుకోగా బోసిపోయి కనిపించిన ఎత్తయిన జెండా స్తంభాన్ని చూసిన వారు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర పురావస్తుశాఖ.. రాష్ట్ర సూపరిండెంటెంట్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

సమాజహితానికి కవులు కృషి చేయాలి

● డాక్టర్ అంపశయ్య నవీన్



కవి సమ్మేళనంలో పాల్గొన్న అంపశయ్య నవీన్

హన్మకొండ కల్చరల్ : సమాజహితానికి కవులు కృషి చేయాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. మంగళవారం హనుమకొండ పద్మాక్షి దేవాలయం రోడ్‌లోని డాక్టర్ జగదీష్‌బాబు ఆస్పత్రి సమావేశపు హాల్‌లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మతసామరస్యం, జాతీయ సమైక్యతకు ప్రతీకగా గంగా, జమునా, తెహజీబ్ పేరుతో కవిసమ్మేళనం, ముషాయిరా నిర్వహించారు. వరల్డ్ పీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్ సిరాజుద్దీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 40 మంది కవులు పాల్గొని కవితాగానం చేశారు. అనంతరం నిర్వాహకులు సిరాజుద్దీన్, రవికుమార్ కవులను సన్మానించారు. సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

పంద్రాగస్టు స్పెషల్ టిఫిన్

● త్రివర్ణ ఇడ్లీ..పూరీ



ఉడిపి హోటల్‌లోని త్రివర్ణ ఇడ్లీ



మూడు రంగుల్లో పూరీ

పరకాల: ఒక్కొక్కరు ఒక్కో రకమైన దేశాభిమానం ప్రదర్శిస్తుంటారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని శ్రీరామ ఉడిపి హోటల్ యాజమాని జాతీయ పతాకాలు, బెలూన్లతో అలంకరించడంతోపాటు మూడు రంగుల ఇండ్లీ..పూరీలతో కస్టమర్లను ఆకట్టుకున్నాడు. పంద్రాగస్టు స్పెషల్ టిఫిన్ అంటూ కస్టమర్లు హాయిగా తినేశారు.

కోర్టులో జెండావందనం..



కోర్టులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న హనుమకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి, పాల్గొన్న న్యాయమూర్తులు, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు. -వరంగల్ లీగల్



కోర్టులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న వరంగల్ జిల్లా న్యాయమూర్తి కె.రాధాదేవి, న్యాయమూర్తులు, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌మోహన్, కార్యదర్శి యాకస్వామి, సిబ్బంది తదితరులు. -వరంగల్ లీగల్

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు

ఎంజీఎం : వైద్య ఆరోగ్యశాఖలో 20 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం వరంగల్, హనుమకొండ జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయాల ఎదుట ఏఎన్‌ఎంలు సమ్మె ప్రారంభించారు. సమ్మెలో పాల్గొన్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ మాట్లాడుతూ రెండో ఏఎన్‌ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్‌ఎంలు, యూరోపియన్ ఏఎన్‌ఎంలు, ఇతర అన్ని స్కీంలలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు రెండు దశాబ్దాలుగా రెగ్యులర్ కాకుండా, సమాన పనికి సమాన వేతనం అమలు కాకుండా నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 31న కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. సమ్మెకు అన్ని ట్రేడ్, క్యాడర్ యూనియన్లు పద్ధతుగా నిలిచి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రభావతి, సరోజ, నర్మద, విజయలక్ష్మి, రోజీ, వరలక్ష్మి, సునీత, విజయ, రజిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి ఎంపీపీ సునీతపై హత్యాయత్నం

హసన్‌పర్తి: హసన్‌పర్తి ఎంపీపీ కేతపాక సునీతపై హత్యాయత్నం జరిగింది. గ్రామానికి చెందిన సమీప బంధువు కొర్నేల్ ఆమెపై కత్తితో దాడికి యత్నించారు. మండలంలోని మల్లారెడ్డిపల్లిలో సోమవారం రాత్రి కొర్నెలు మేనకోడలు శారీ ఫంక్షన్‌జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కుటుంబీకులతో పాటు ఆమె బంధువులు కూడా వెళ్లారు. అయితే అక్కడ కొర్నెల్‌కు ఎంపీపీ బంధువుకు గొడవ జరిగింది. దీనిని అవమానకరంగా భావించిన కొర్నెలు తన కుటుంబసభ్యులతో కలిసి ఎంపీపీ ఇంటికి వచ్చి ఆమెపై కత్తితో దాడికి యత్నించాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్యగొడవ జరిగింది. ఈ ఘటనలో కొర్నెలుకు తీవ్రగాయాలు కాగా ఎంజీఎం తరలించారు. కాగా, ఎంపీపీ సునీతతో పాటు ఆమె భర్త రాజు మరో ఆరుగురు తనపై దాడి చేశారని కొర్నెల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, తనపై కత్తితో దాడి చేశారని కొర్నెల్‌తో పాటు మరో ఇద్దరిపై ఎంపీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.